# అరిష్టం




కుటుంబంలో సీరియల్‌గా సంభవిస్తున్న సంఘటనలతో కృంగిపోయాడు కామేశం. కష్టాలన్నీ కట్టగట్టుకుని తననే ఎందుకు పలకరిస్తున్నాయో తెలియడం లేదు.

"ఇంటికేదో శని పట్టిందండి. మీ తాతయ్యగారు పోనడమేంటి? పిల్లాడు పరీక్ష తప్పడమేంటి? పిల్లకొచ్చిన సంబంధం చెడిపోవడమేంటి?" కంటతడిపెడుతూ అన్నది అపర్ణ.

"నువ్వన్నది నిజమేనే. మనింటికేదో దోషం ఉంది. నివారణకి ఏం చెయ్యాలో సిద్ధాంతిగారిని అడుగుతాను" సమస్యకు పరిష్కారం దొరికినట్లు సంబరపడుతూ అన్నాడు కామేశం. ఇంకేముంది 'తలచుకున్నప్పుడే తాత పెళ్లి అన్నట్లు' సిద్ధాంతుల సూచనల మేరకు జపాలు, శాంతులు జరిపించి చేతులు కాల్చేసుకున్నాడు. అయినా అతడి వెతలు తీరలేదు. ఏం చెయ్యాలో పాలుపోక వాస్తు నిపుణుడుని ఇంటికి లాక్కొచ్చాడు.

ఈ ఇల్లు వాస్తు విరుద్ధంగా కట్టబడింది. అందుకే మీకిన్ని అరిష్టాలు సంభవిస్తున్నాయి" అన్నాడు వైకుంఠం ఇంటిని భూతద్దంలో పరిశీలించి.

"అందుకే కదా మిమ్మల్ని పిలిచింది. వాస్తు ప్రకారం ఏయే మార్పులు చెయ్యాలో

సెలవిస్తే..." అర్థింపుగా అంటూ ఆగాడు కామేశం.

"ఇంటిని పడగొట్టించి పునర్నిర్మించవలసిందే. వెంటనే ఆ పని చెయ్యకపోతే మీరు మరిన్ని ఇబ్బందులు పడవలసి వస్తుంది. చూస్కోండి" హెచ్చరించాడు వైకుంఠం.

ఆలోచనలో పడ్డాడు కామేశం. ఇల్లు పడగొట్టి కట్టించాలంటే మాటలా!?

"మీరా పని చెయ్యలేకపోతే ఏదైనా అద్దె ఇంట్లోకి వెళ్ళిపొండి" అన్నాడు వైకుంఠం అతడి అంతరంగాన్ని అర్థంపడుతూ.

క్షణాలమీద ఇంటికి 'టులెట్ బోర్డు తగిలించి అద్దె కొంపలోకి మారిపోయాడు కామేశం. రోజులు గడుస్తున్నా అందులో దిగడానికి ఎవరూ సాహసించడం లేదు. బహుశా విషయం అందరికి తెలిసిపోయిందేమో!

ఇక ఇలా లాభం లేదనుకుని ఇంటిని అమ్మకానికి పెట్టాడు. అయితే కొనడానికెవరూ ముందుకు రాకపోవడంతో మరింత దిగాలు పడిపోయాడు.

ఇలా ఉండగా ఓ రోజు ఆ ఇంటిని కొనడానికి ఎవరో వచ్చారు.

"పన్నెండు లక్షలిస్తే చెప్పండి"

కామేశం మాటలకు ఓ వెకిలి నవ్వు నవ్వి 'ఈ పాత కొంపని అంత ధరపెట్టి ఎవరు కొంటారు? పైగా దీనికి వాస్తు దోషం ఉందని తెలిసింది. మేం గనుక ధైర్యం చేసి వచ్చాం. మూడు లక్షలకైతే చెప్పండి ఇవాళే క్యాషిచ్చి తీసుకుంటా' నోరూరిస్తున్నట్లు అన్నాడు ఆ ఆసామి.

ఇంకా లేటు చేస్తే ఆ రేటు కూడా పలకదేమోనని సరేనన్నాడు కామేశం.

ఉన్నపళంగా డబ్బిచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు వచ్చిన వ్యక్తి.

తన కొంపని ఎంతో కారు చవకగా కొట్టేసిన ఆ వ్యక్తి వైకుంఠం కొడుకేనని తెలిసి కంగుతిన్నాడు కామేశం.

(నవంబర్ 2009 'చతుర' మాసపత్రిక)